మొక్కజొన్న.. లాభాలేనన్న!

- పంట సాగుపై రైతుల మొగ్గు
- తక్కువ నీటితో దిగుబడి సాధించే అవకాశం
- నియోజకవర్గంలో 5 వేల ఎకరాలకుపైగా సాగు..

ఓడీచెరువు: పుట్టపర్తి నియోజకవర్గంలో మొక్కజొన్న సాగు వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. పంట సాగుకు తక్కువ నీటితోపాటు పెట్టుబడి కూడా తక్కువ కావడమే ఇందుకు కారణం. వివరాలు ..పుట్టపర్తి నియోజకవర్గవ్యాప్తంగా రబీ సీజన్‌లో 5 వేల ఎకారలకుపైగా మొక్కజొన్న సాగు చేశారు. ఇందులో అత్యధికంగా పుట్టపర్తి, కొత్తచెరువు మండలాల్లో 1500 ఎకరాల చొప్పన పంట సాగైంది. పంటకు చీడపీడలు తక్కువగా ఆశించడం, మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభిస్తుండటం రైతులను అటువైపు ఆసక్తి చూపేలా చేసింది.


ఏపుగా పెరిగిన మొక్కజొన్న

పంట పెట్టుబడి తక్కువే..

వరి, వేరుశగన, ఇతర పంటలతో పోలిస్తే మొక్కజొన్న సాగుకు పెట్టుబడి తక్కువ పడుతుంది. విత్తనాలకు రూ.3,200 నుంచి రూ.3,500, పంట సాగుకు రూ.3 వేలు, ఎరువులు, పురుగుమందులకు రూ.2 వేలు, పంట కోతకు రూ.2 వేల దాకా ఖర్చవుతుంది. మొత్తం మీద ఎకరాకు రూ.10 వేల నుంచి 15 వేలలోపు వ్యయమవుతుంది. ఇక దిగుబడి ఎకరాకు 30 నుంచి 40 క్వింటాళ్ల దాకా వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా ధర రూ.2 వేలకు పైగా పలుకుతోంది. ఈలెక్కన ఎకరాకు రూ.70 వేల నుంచి రూ.80 వేల దాకా ఆదాయం సమకూరుతోంది.

పుట్టపర్తి నియోజకవర్గంలో రబీ కింద మొక్కజొన్న సాగు వివరాలు..

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
పుట్టపర్తి	1,500
ఓడీచెరువు	1,360
అమడగూరు	400
నల్లమాడ	800
బుక్కపట్నం	400
కొత్తచెరువు	1500

టమాటతో నష్టపోయా..



గత సీజన్‌లో 3.5 ఎకరాల్లో టమాట సాగు చేసి, దాదాపు రూ.2.5 లక్షలు నష్ట పోయా. ఈ సారి ధైర్యం చేయలేక, డబ్బు లేక మొక్కజొన్న సాగు చేశా. 3.5 ఎకరాల్లో పంట సాగుకు దాదాపు రూ.60 వేలు ఖర్చు పెట్టాను. 120 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. క్వింటా ధర రూ.2270తో అమ్మగా రూ.2,7 లక్షలు ఆదాయం లభించింది. పెట్టుబడి పోనూ రూ.2.10 లక్షలు మిగిలింది.

– బయపరెడ్డి, రైతు, మామిళ్లకుంట్లపల్లి ఓడీచెరువు మండలం

మొక్కజొన్న సాగుతో ఆదాయం



మొక్కజొన్న సాగు లాభదాయకంగా ఉంటుంది. మొక్కజొన్న సాగులో సాలుకు సాలుకు మధ్య 60 సెంమీ మొక్కకు మొక్కకు మధ్య 20 సెంమీ దూరం ఉండేలా చూసుకుంటే మంచి దిగుబడి వస్తుంది. భూసార పరీక్షను అనుసరించి ఎరువులు వేసుకోవాలి. వ్యవసాయాధికారుల సూచనల మేరకు పురుగు మందులు వాడితే ఫలితాలు ఉంటాయి.

– ఇలియాజ్ అహమ్మద్, ఏఓ, ఓడీచెరువు

క్లుప్తంగా

రామాలయానికి విరాళం


విరాళం అందజేస్తున్న వజ్రభాస్కర్ రెడ్డి

తలుపుల: మండలంలోని నూతనకాల్వ గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఇటీవల సీతారామ లక్ష్మణ ఆంజనేయ విగ్రహాలను ప్రతిష్ఠించారు. శనివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయానికి తన వంతు సహాయంగా రూ.20 వేలను కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యాక్టివిటీ సెక్రటరీ చెన్నకృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు జి.ఓబులరెడ్డి, చక్రవర్ధన్, బి.ఓబులరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న మాజీ మంత్రి శంకరనారాయణ సోదరుడు మల్లికార్జున

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో నిర్మిస్తున్న ధన్వంతరి వైద్య నారాయణ ఆలయ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ మాజీ మంత్రి మాలగుండ్ల శంకర నారాయణ సోదరుడు మాలగుండ్ల మల్లికార్జున శనివారం రూ.50 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొత్తచెరువు ఎంపీడీఓగా నటరాజ్



పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్డీగా పనిచేస్తున్న నటరాజ్‌కు ఎంపీడీఓగా పదోన్నతి లభించింది. శనివారం ఆయన కొత్తచెరువు ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మండల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని తెలిపారు. అనంతరం పలు పార్టీల నేతలు, పంచాయతీ కార్యదర్శులు నూతన ఎంపీడీఓకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోండి


హరియాన్‌చెరువులో గర్భవతిని పరీక్షిస్తున్న డాక్టర్ రవినాయక్

చెన్నేకొత్తపల్లి: భానుడి భగభగలతో జిల్లా వ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ఈ నేపథ్యంలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ సూచించారు. శనివారం మండల పరిధిలోని హరియాన్‌చెరువు గ్రామంలో 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవినాయక్ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. అదేవిధంగా గర్భవతులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం వారు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, జాగ్రత్తలు గురించి వివరించారు. ఎండలో పని చేసే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ గోవిందమ్మ, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, ఏఎన్‌ఎం అశ్విని, ఆశావర్కర్ బాలమ్మ, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

బత్తలపల్లి: ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నరసింహ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ.. కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. రోజుకు రూ.700 కూలి దక్కేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సూచించారు. ఉపాధి పనుల వద్ద ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు ఏర్పాటు చేయడంతో పాటు మండుతున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. మస్టర్‌లో అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. పనులు జరిగే సమయంలో కూలీలు మరణిస్తే ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బండల వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బత్తల నాగభూషణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు వడ్డె సన్న పెద్దన్న, రైతు సంఘం మండల కార్యదర్శి రామకృష్ణయ్య, రైతు సంఘం మండల అధ్యక్షుడు సత్యప్ప, సహాయ కార్యదర్శి సత్యమయ్య, సాకే నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


రిలే దీక్షలు చేపట్టిన సీపీఎం నాయకులు

కదిరి టౌన్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ సీఎం చంద్రబాబు నాయుడు వెంటనే నెరవేర్చాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన నిరుపేదలకు పట్టణంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణంలో టిడ్కో లబ్ధిదారులకు తక్షణమే ఇళ్లను కేటాయించాలని కోరారు. పట్టణంలోని అమీన్‌నగర్, కుమ్మరవాండ్లపల్లి ప్రాంతాల్లోని సచివాలయం, తహసీల్దార్‌కు అర్జీలు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు జీఎల్ నరసింహులు, సాంబశివ, బాబ్జాన్, జగన్మోహన్, రామ్మోహన్, శాంతిబాయి, సుధాకర్ రెడ్డి, రఫీ, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ 104 వైద్య సేవలు


రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజ బేగం

పుట్టపర్తి అర్బన్: గ్రామాల్లోని ప్రతి కుటుంబానికీ 104 ద్వారా వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజ బేగం పేర్కొన్నారు. శనివారం పుట్టపర్తి మండలం మార్లపల్లి గ్రామంలో 104 ద్వారా అందిస్తున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. 104 ద్వారా గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు వైద్య సేవలు అందించాలన్నారు. దీర్ఘకాలిక రోగులకు నెలకు సరిపడా మందులు అందజేయాలని సూచించారు. వైద్య సేవలతో పాటు ఆరోగ్య నియమాలు తెలియజేస్తూ.. మంచి పౌష్టికాహారం విలువలు తెలపాలన్నారు. మాతా శిశు సంరక్షణ, సీజనల్ వ్యాధులు, వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోత్స్న, సీహెచ్‌ఓ నగేష్, సూపర్‌వైజర్ వెంకటరమణ, చంద్రకళ, శివ, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం


ప్రజలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పుట్టపర్తి టౌన్: కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు అవుతున్నా గ్రామీణ ప్రాంతాలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఈఎస్ వెంకటేస్, బ్యాళ్ల అంజి మండిపడ్డారు. శనివారం పుట్టపర్తి రూరల్ మండలం అమగొండపాలెంలో పేదరిక నిర్మూలనపై గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్న ప్రజల జీవన విధానాలు మారడం లేదన్నారు. నేటికి విద్య, వైద్యం సక్రమంగా అందడం లేదని తెలిపారు. ఉపాధి పనులు కూడా సక్రమంగా కల్పించక పోవడంతో కూలీలు వలస వెళ్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా పేద ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. పేద ప్రజల సమస్యలపై సీపీఎం నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు.

పర్యాటకులపై దాడులు బాధాకరం


తలుపులలో నినాదాలు చేస్తున్న ప్రజలు

నల్లచెరువు: జమ్మూకాశ్మీర్‌లో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతున్న పర్యాటకులపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపి చంపడం దుర్మార్గమని బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఇంతియాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకూ మండల ప్రజలు స్థానిక ప్రజా ప్రతినిధులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన..

ధర్మవరం: పహల్గాంలో ఉగ్రవాదుల దాడికి నిరసనగా పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో శనివారం అధికారులు, డాక్యుమెంట్ రైటర్లు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్లు మాట్లాడుతూ.. పహల్గాంలో ఉగ్రవాదులు హిందువులనే లక్ష్యంగా చేసుకుని అత్యాధునిక ఆయుధాలతో చంపడం దుర్మార్గమని తెలిపారు. ఉగ్రవాదులను ఏరివేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్ల సంఘం నాయకులు చాంద్ బాషా, అల్లం రామంజి, మల్లికార్జున, బాలాజి, గోపి, వాజీద్, జావేద్, భాస్కర్, మహేంద్ర, కీర్తి, నాగార్జున, మల్లికార్జున, ధనుంజయ, అనిల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తలుపులలో..

తలుపుల: పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ శనివారం ప్రజాసంఘాలు, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. మూడు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం


పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్‌ను సన్మానించిన దృశ్యం

కదిరి టౌన్: వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యమని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన వల్లం రాజేంద్రప్రసాద్ యాదవ్ శనివారం మక్బూల్ అహ్మద్‌ను పార్టీ కార్యాలయంలో కలసి సన్మానించారు. ఈ సందర్భంగా బీఎస్ మక్బూల్ అహ్మద్ మాట్లాడుతూ.. విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు, కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. రాబోవు రోజుల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా, బీఎస్ మక్బూల్ అహ్మద్‌ను శాసన సభ్యుడిగా గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, బీఎస్ మక్బూల్ అహ్మద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అన్సార్, రమేష్ యాదవ్, షకీల్, బాబా, షాహిద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


గర్భిణులకు సీమంతం చేస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే పల్లె సింధూర, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పేర్కొన్నారు. శనివారం పుట్టపర్తిలోని ఆర్‌వి జానకీ రామయ్య కళ్యాణ మంటపంలో మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాల ఆవశ్యకతను తెలుసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసి ప్రదర్శనకు ఉంచిన చిరుధాన్యాల తినుబండారాలను రుచి చూశారు. అనంతరం ప్రతిభ కనబరిచిన అంగన్‌వాడీ కార్యకర్తలకు బహుమతులు అందజేశారు. ఇందులో భాగంగా గర్భిణులకు సీమంతం, చిన్న పిల్లలకు అన్నప్రాసన చేశారు. గర్భిణులకు చీరలు, పసుపు, కుంకుమ అందజేశారు. కార్యక్రమంలో అన్ని ప్రాజెక్టుల సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడితో పోలీసుల అప్రమత్తం


ధర్మవరం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న బాంబు స్క్వాడ్ సిబ్బంది, పోలీసులు


పుట్టపర్తిలో తనిఖీలు చేస్తున్న డీఎస్పీ విజయకుమార్, సిబ్బంది

ధర్మవరం అర్బన్: పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడితో పోలీసులు అప్రమత్తమయ్యారు. టూ టౌన్ సీఐ రెడ్డప్ప శనివారం సాయంత్రం పట్టణంలోని లాడ్జీల్లో తనిఖీలు చేపట్టారు. రికార్డులను పరిశీలించి, లాడ్జీలకు వచ్చే వారి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం మార్కెట్‌యార్డు సమీపంలో వాహనాలను తనిఖీ చేశారు. రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల బ్యాగులను బాంబు స్క్వాడ్ సిబ్బంది పరిశీలించారు.

పుట్టపర్తిలో విస్తృతంగా తనిఖీలు

పుట్టపర్తి టౌన్: అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు శనివారం డీఎస్పీ విజయకుమార్, మహిళా పోలీస్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, హోటళ్లు, లాడ్జీలు, జనసంచారం ఉన్న ప్రదేశాల్లో సోదాలు నిర్వహించారు. ఆధార్ కార్డులను తనిఖీ చేశారు. లాడ్జి పరసర ప్రాంతాలు కనబడేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమానిత వ్యక్తులను గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ సునీత, సురేష్ స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ భక్తుల పర్తియాత్ర


సంగీత విభావరి నిర్వహిస్తున్న నాగర్ కర్నూల్ భక్తులు


భక్తిగీతాలు ఆలపిస్తున్న దృశ్యం

ప్రశాంతి నిలయం: నాగర్ కర్నూల్ జిల్లా సత్యసాయి భక్తులు పర్తియాత్ర పేరుతో పుట్టపర్తి ప్రశాంతి నిలయానికి విచ్చేశారు. శనివారం ఉదయం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో తాందూలార్చన నిర్వహించారు. అనంతరం సత్యసాయిని కీర్తిస్తూ భక్తిగీతాలు ఆలపించారు. సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సంగీత విభావరి నిర్వహించారు. చక్కిటి భక్తిగీతాలతో భక్తులను మైమరపించారు.

'ఆర్డీటీ సేవలకు ఆటంకం వద్దు'

కదిరి: కేంద్ర, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వాలు ఆర్డీటీ సేవలను అడ్డుకోవాలని చూడటం మంచిది కాదని సీపీఐ జిల్లా కార్యదర్శి మీసాల వేమయ్య యాదవ్ పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక సీపీఐ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఫెర్రర్ దంపతులు ఆర్డీటీ సంస్థ ద్వారా ఉచితంగా సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. ఈ సంస్థ ద్వారా అన్ని వర్గాల ప్రజలు సేవలందుకున్నారని పేర్కొన్నారు. అలాగే ఎంతోమంది ఇందులో పని చేస్తూ ఉపాధి అవకాశాలు పొందుతున్నారని తెలిపారు. ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్‌ఏ) కింద వివిధ దేశాల నుంచి ఆర్డీటీకి అందుతున్న సహాయాన్ని అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు. రాజకీయాలకు అతీతంగా దీన్ని ఖండించాలని పిలుపునిచ్చారు. ఆర్డీటీ సేవలకు ఆటంకం కల్గిస్తే కూటమి ప్రభుత్వానికి ప్రజలు సరైన సమయంలో బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు.

ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా నాగార్జున రెడ్డి



ధర్మవరం అర్బన్: ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా ధర్మవరం పట్టణానికి చెందిన కేబీ నాగార్జున రెడ్డి ఎంపికయ్యారు. ఇటీవల పట్టణంలో జరిగిన ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా నాగార్జునరెడ్డిని రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రావు, ప్రధాన కార్యదర్శి నరసయ్య ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

ఎంపీడీఓ రెడ్డెప్పకు సన్మానం


ఎంపీడీఓ రెడ్డెప్పను సత్కరించిన అధికారులు

తనకల్లు: ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పనిచేస్తూ రెగ్యులర్ ఎంపీడీఓగా పదోన్నతి పొందిన రెడ్డెప్పను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అసోసియేషన్ ఆఫ్ సెక్రటరీయెట్ ఇంజినీర్స్ జిల్లా బృందం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రాజశేఖర్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్ర నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అఖిల్ కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ జనార్దన్ రెడ్డి, ప్రియాంక, ఇంజినీరింగ్ సహాయకులు కుళ్లాయి స్వామి, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు


విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: మండల పరిధిలోని చవిటితండాలో పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులకు శనివారం హార్ట్ టు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మూడే రవినాయక్ నగదు బహుమతులు అందజేశారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వెంకటేష్ నాయక్, నర్సినాయక్, భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

ముదిగుబ్బ: మండల పరిధిలోని గరుగుతండా, అడవి బ్రాహ్మణపల్లి తండాల సమీపంలోని నాటుసారా స్థావరాలపై శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. జరిపాల రంగానాయక్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రెండు లీటర్ల నాటుసారా, అలాగే 60 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకున్నట్లు ధర్మవరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాటుసారా తయారీ, విక్రయించడం చట్ట విరుద్ధమన్నారు. అలాగే నాటుసారాతో కలిగే అనర్థాలను వివరించారు. దాడుల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ చాంద్‌బాషా, నాగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

కనగానపల్లి: స్థానిక గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి గోవిందు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 6వ తేదీ వరకు 40 రోజుల పాటు జరిగే ఈ శిక్షణ శిబిరంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించడంతో పాటు ఇన్‌డోర్ గేమ్స్‌పై శిక్షణ అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానం పెంచుకోవాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పుట్టపర్తి టౌన్: ఎన్‌హెచ్‌ఎం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు కోరారు. శనివారం పుట్టపర్తి పట్టణంలో ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డిని కలసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జీతభత్యాలు సకాలంలో అందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.